

# రెప్పల మీద నీడలు

## – అత్తలూరి విజయలక్ష్మి



## (గత సంచిక తరువాయి)

9

**మెల్లగా నడుస్తూ** పవిత్ర వెనకాలే వెళ్తున్న మోహన్ హటాత్తుగా ఆమె నడవడం ఆపి, వెనక్కి తిరిగి తన వైపు రావడం చూసి ఉలిక్కిపడ్డాడు.

ఆమె మొహం కోపంతో ఎర్రగా, మధ్యాహ్న ఎండకి మరింత ఎర్రగా మారిన మంకెనపూవులా ఉంది. ముక్కుపుటాలు అదురుతుంటే అతనికి బాగా చేరువగా వచ్చి నిలబడి, సూటిగా కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

"నా వెనకాల ఎందుకు వస్తున్నావు? నా బాడీగార్డ్ వా? మానాన్న కానీ, మీ నాన్న కానీ నన్ను కాపలా కాయమని నీకు చెప్పారా? లేకపోతే ఇంకెవరన్నా నిన్ను జీతగాడిగా పెట్టుకుని నేనెక్కడికి వెళ్తున్నాను? ఏం చేస్తున్నాను? ఎవరితో తిరిగాను అని కనిపెట్టమన్నారా?" ఆవేశంతో రొప్పుతూ అడుగుతున్న ఆమె వైపు నిశ్చేష్టుడై చూస్తూ ఉండిపోయాడు. అతని నోటి నుంచి ఒక్క అక్షరం కూడా బయటకి రాలేదు.

ఆమె నోటి నుంచి నిప్పురవ్వలు రాలుతున్నట్టు అవి అతనిని దహిస్తున్నట్టు అనిపిస్తుంటే అలా కళ్ళప్పగించి, నిరుత్తరుడై నిలబడిపోయాడు.

ఆమె ఎడమకాలు చెట్టు మొదలుకి ఆనించి, చేతులు కట్టుకుని పొగరుగా నిలబడి అంది "ఏంటలా గుడ్లప్పగించి చూస్తున్నావు? ఎక్కడిదాకా వెళ్తావో వెళ్ళు. నేను ఇక్కడే ఉంటాను. నువ్వు నా కళ్ళకి కనిపించనంత దూరం వెళ్ళిందాకా ఇక్కడే ఉంటాను".

మోహన్ సమాధానం చెప్పడం కానీ, అక్కడి నుంచి ఇంచు కూడా కదలడం కానీ చేయలేదు. ఆలోచిస్తున్నాడు. ఇంత అందమైన ఈ అమ్మాయిలో ఇంత కాఠిన్యం ఎలా వచ్చింది? ఇలా ఎలా మాట్లాడ గలుగుతోంది.

చూస్తున్నా కొద్దీ చూపు తిప్పుకోలేనంత అందం. పాలల్లో పసుపు, మంచి గంధం రంగరించినట్టు ఉన్న శరీరపు కాంతి, పోగుచేసిన నక్షత్రాలను ముద్దచేసి, వజ్రంతో తాపడం చేసినట్టు మెరుస్తున్న కళ్ళు, శివుడి మెడను చుట్టుకుని, గుండెల మీద పడగ ఎత్తినట్టున్న జడ, సన్నని నడుముని చుట్టుకుని, గుండెలను హత్తుకున్న జార్జెట్ ఓణీ, అరతెరిచిన

గొడుగులా ఓ పక్కకి పడిన పరికిణీ కుచ్చిళ్ళు గాలికి సుతారంగా కదులుతుంటే, వయ్యారంగా చెట్టు మొత్తాన్ని ఆలింగనం చేసుకున్న మందార పూరెమ్మలా ఉంది.

పరిసరాలను మరిచిపోయి, తన్మయత్వంతో  చూస్తున్న మోహన్ పెద్దగా ఉరిమినట్టు వినిపించిన ఆమె స్వరం విని త్రుళ్ళిపడ్డాడు.

"వెళ్ళు" తాను ఇంటినుంచి నడచివచ్చిన దారివైపు తర్జని చూపిస్తూ అరిచింది.

ఓ అందమైన భావచిత్రాన్ని చూస్తున్నట్టు పరవశంలో మునిగిపోయిన మోహన్ కి అకస్మాత్తుగా తనని ఎవరో వాడి శస్త్రాల తో దాడి చేస్తున్నట్టు అనిపించింది. గాయపడిన హృదయంతో, దుఖంతో వణికాడు. నిశ్శబ్దంగా తల వంచుకుని ఆమె చూపించిన వైపు కదిలాడు.

అతను వెళ్తున్నవైపు విజయగర్వంతో చూసి, గబుక్కున అక్కడినుంచి కదిలి, వేగంగా శివ క్లినిక్ వైపు వెళ్ళింది పవిత్ర.

పవిత్ర చూపులు పాదాల కింద పదునైన ముళ్ళులా తగులుతుంటే అడుగులు బలవంతంగా వేయసాగాడు. మనసు మూగగా ఆక్రోశిస్తోంది "ఎందుకు పవిత్రకి నేనంటే ఇంత అసహ్యం?" అని పదే పదే తనని తాను ప్రశ్నించుకుంటున్నాడు.

అలా ప్రశ్నించుకునే ముందు అతను ఒక్కసారి తనని తాను పరిశీలించుకుంటే తెలిసేది. అలా ఆత్మ పరిశీలన చేసుకోడానికి అతని వయసు సరిపోదు. ఆ వయసుకి ఆశ, కోరిక, మోహం వీటితో కూడిన ఒక భావోద్వేగం చాలా సహజం. ఆ భావోద్వేగం అనేది లేకపోతే ఈ ప్రపంచంలో ఇన్ని ప్రేమకథలు ఉండేవి కాదు. పురాణాలు చదివినా ఇతిహాసాలు చూసినా, చరిత్ర తిరగేసినా మనిషిని మత్తులో పడేసేది ప్రేమ... ఆ ప్రేమ మనిషిలో విచక్షణ చంపేస్తుంది, వివేకం తల నరికివేస్తుంది... దానివలన నాశనం అయిన జీవితాలెన్నో... సామ్రాజ్యాలు కూలిపోయిన తార్కాణాలు ఎన్నో. అయినా మనిషి ప్రేమించడం, ఆశ పడడం మానడు. ఇప్పుడు మోహన్ పరిస్థితి అదే. అతనికి పవిత్ర అంటే ఒక్క ప్రేమ కాదు...ఆమె అతని  సర్వస్వం.

ఆమె ఆలోచనలతో, ఆమె మైకంలో అతను చదువు నిర్లక్ష్యం చేసాడు. ఆమెకోసం, కేవలం ఆమె కోసమే కాలేజీకి వెళ్తున్నాడు, వస్తున్నాడు కానీ, ఇంటికి వచ్చాక అస్తమానం పియానో మీద విషాద గీతాలు, ఆలాపిస్తూ తన గదిలోనే ఉంటున్నాడు. కానీ అతని అంతర్నేత్రం మాత్రం ఆమె ఎక్కడుంది? ఎక్కడికి వెళ్తుంది అని అన్వేషిస్తూనే ఉంటుంది. ఆమె తనని నిర్లక్ష్యం చేసిన కొద్దీ ఆమె మీద ప్రేమ తగ్గడం లేదు. ఆమెకి తను తగిన వాడు కాదని, ఆమె అందని చందమామ అని, ఆమె ఒక పారిజాత సుమం అనీ, తాను ఒక గరికపోచ అనీ అతని మనసుకి అనిపించి ఉంటే కథ ఇలా ఉండేది కాదు.

అతని గుండెల్లో ఆమె దేవత... ఊహల సుమాలతో నిత్యం అర్చిస్తూనే ఉండే భక్తుడు.

ఆమె స్వరంవింటే గాలి, చెవిలో రాగాలు ఆలపిస్తున్నట్టు, ఆమె నడిస్తే ఏరు గలగల శబ్దం చేస్తున్నట్టు, ఆమె నవ్వితే జగమంతా వెలుగుతో నిండినట్టు, ఆమె నడుస్తుంటే మేఘాలు నేలమీద విహరిస్తున్నట్టు ఇలా ఏవో భావాలు అతనిలో ఉప్పొంగుతూ ఉంటాయి. అతనిలోని భావుకుడు నిద్రలేస్తాడు. ఆమె ఒక నడిచే స్వర్ణకమలం అనుకుంటాడు. ఆ కమలం నిత్యం తన మానస సరోవరంలోనే ఉండాలి. అవును ఆమె కావాలి.

అవును... ఈ ప్రపంచం ఏమైపోయినా ఆమె కావాలి... ఆకాశం, భూమి తల్లకిందులు అయినా ఆమె కావాలి. మోహన్ స్థిరంగా నిశ్చయించుకున్నాడు.

అలా నిశ్చయించుకున్నాక మనసు పావురాయి అయింది. గాలిలో ఎగురుతున్నట్టు ఇంటికి వెళ్ళిపోయి పియానో ముందు కూర్చున్నాడు. 'నిన్న లేని అందమేదో నిదురలేచేనెందుకో' పాట గుండె నిండుగా అనుభూతి చెందుతూ పాడుకున్నాడు.

ఆ తరవాత లేచి చేతులు చాచి గుండ్రంగా తిరిగాడు. గబుక్కున టేబుల్ దగ్గర కూర్చుని నోట్ బొక్, పెన్ తీసుకుని రాయసాగాడు.

పలుకుల చిలుక నన్ను చూసి
మూగబోతుందేమో! పలుకే రాదు...
నవ్వుల పూదోట  నన్ను చూసి నివ్వేరబోతుందేమో
ఒక్క పూవూ పరిమళించదు
నా హృదయం అనే దేవాలయంలో
ప్రతిష్టించానే గానీ, అభిషేకాలు, అర్చనలు
చేయలేదేమో!
మౌనం వహించి నన్ను వధించకు చెలీ,
పలుకవా ఒకసారి,
ప్రేమతో పరిమళించవా?
నీవు లేని ఈ  జీవితం పగలు, రాత్రిలేని
శూన్యం అవుతుంది...
ఎంత ప్రయత్నించినా
రాత్రి కరిగిపోదు. పగలు జరిగిపోదు...
నిదురా రాదు, మెలకువా రాదు...
ఎందుకు నాకీ శిక్ష చెలీ?

నావలన జరిగిన తప్పేమిటి? ఎందుకు నా మీద కోపం?

ఒక్కసారి నా చెవిలో అదేదో చెప్పి పోకూడదూ.

నా హృదయాన్ని పగలగొట్టి వెళ్ళిపోయావు?

పగిలిన పలకలు ఏరుకుంటూ, అతికించుకుంటూ,

శోకిస్తూ, ఆక్రోశిస్తూ

నేనిలా ఉండిపోవాల్సిందేనా

ఈ జీవితం కేవలం ఒక శిక్షగా మిగలాల్సిందేనా

నా తప్పేమిటి? నా మీద ఎందుకు కోపం?

చెవిలో చెప్పి పోరాదూ?...

పదే, పదే తను రాసిన ఆ వాక్యాలు చదువుకుంటూ, తప్పులు సరిదిద్దుకుంటూ, నచ్చని వాక్యం కొట్టేసి, కొత్త వాక్యం రాస్తూ, ఓ అందమైన కవిత చెక్కడానికి ప్రయత్నిస్తున్న అతని పెదవుల మీద ఓ దరహాసం మెరిసింది.

పవిత్ర ఊహే చాలు కదూ బతకడానికి అనుకున్నాడు. ఆమె పక్కన ఉంటే ఈ ప్రపంచాన్ని జయించి రాడూ!

అతనలా పవిత్ర తలపుల్లో మునకలు వేస్తూ ఉండగా వినిపించింది "నాన్నా! మోహన్!" అనే చాముండేశ్వరి స్వరం.

మోహన్ చేతిలో పెన్ జారిపోయింది. చెంపలమీద చల్లగా తగిలింది. చేత్తో చెంపమీద తడిమాడు. తడిగా తగిలింది. గబగబా షర్టు కొసతో చెంపలు తుడుచుకుని కుర్చీలోంచి లేచి గదిలో నుంచి బైటకి వచ్చాడు. ఆవిడ కింద మెట్టు మీద ఒక కాలు పెట్టి అతని గదివైపు చూస్తోంది.

"ఏంటమ్మా?" అనడిగాడు.

"ఏం చేస్తున్నావురా? టైం చూసావా? తొమ్మిది దాటుతోంది. అన్నానికిరా నాన్న ఎదురుచూస్తున్నారు."

"వస్తున్నానమ్మా" చటుక్కున వెనక్కి తిరిగి గదితలుపు జారేసి, మెట్లు దిగసాగాడు. ఆవిడ డైనింగ్ టేబుల్ వైపు వెళ్ళింది భోజనం సిద్ధం చేయడానికి.

చాముండేశ్వరికి మోహన్ అంటే ప్రత్యేకమైన ప్రేమ. కారణం ఇద్దరి మగపిల్లల్లో పెద్దవాడు ఆవిడలా అందంగా ఉంటాడు, తెలివైనవాడు... పైగా బతకనేర్చిన వాడు... కానీ మోహన్ అమాయకుడు, స్ఫటికం లాంటి మనసున్నవాడు, సంగీతం అన్నా, కవిత్వం అన్నాచాలా ఇష్టం... భావుకుడు.

సున్నితమైన అతని మనసు ఆవిడకి తెలుసు. తను నల్లగా, పొట్టిగా ఉంటానని చిన్నప్పుడు తల్లి దగ్గర వాపోతుండేవాడు.

ఆవిడ "రూపందేముంది నాన్నా? మనసు మంచిది కావాలి. నీ మనసు మల్లెపూవురా... బంగారు తండ్రివి నువ్వు" అంటూ ప్రేమగా నచ్చచెప్పేది. ఆవిడ నోటి నుంచి అనేకసార్లు వచ్చిన ఆ అక్షరాలు అన్నీ అతని గుండెగోడల మీద శిలాక్షరాలుగా నిలిచిపోయాయి.

అప్పటి నుంచి మరింత మంచిగా పదిమందికి సాయపడుతూ, ఎవరి మీద ద్వేషం, అసూయ పెంచుకోకుండా తన మనసుని స్వచ్ఛంగా కాపాడుకుంటున్నాడు. అప్పుడప్పుడు మాత్రం నాకు ఎవరి పోలిక వచ్చి ఉంటుంది? అని ఆలోచిస్తూ మధన పడేవాడు. కానీ ఇప్పుడు వయసు పెరుగుతుంటే అందం అనేది తాత్కాలికం అని, మంచి మనసే శాశ్వతం అనీ తెలుసుకున్నాక నిశ్చింతగా ఉంటున్నాడు.

ఏనాటికైనా పవిత్ర తనని అర్థం చేసుకుని ప్రేమిస్తుందని గాఢంగా విశ్వసిస్తున్నాడు. అందుకోసం అలుపు లేకుండా ప్రయత్నిస్తున్నాడు, ప్రయత్నిస్తూనే ఉన్నాడు. చిన్నపిల్ల అయిన పవిత్ర బాల్యచాపల్యంతో తన మీద చిరాకు పడుతోందని, తప్పకుండా ఒకరోజు తన చిటికెన వేలు పట్టుకుని, తన జీవన ప్రాంగణంలోకి రాజసం ఉట్టిపడుతూ ఠీవిగా నడచి వస్తుందని అతని ఆశ.

అన్యమనస్కంగా భోంచేస్తున్న మోహన్ వైపు ప్రేమగా చూస్తూ అడిగింది చాముండేశ్వరి. "మోహన్ ఈ మధ్య పియానో మీద శ్రద్ధ ఎక్కువ చూపిస్తున్నావు...సినిమా పాటలకన్నా సంగీతం నేర్చుకోకూడదూ".

మోహన్ ఆశ్చర్యంగా ఆవిడ వైపు చూసాడు "సంగీతమా? నేనా?" అన్నాడు.

"అదేంటిరా ఇందులో అంత ఆశ్చర్యపోడానికి ఏముంది? ఈ ఊళ్ళో సంగీతం నేర్పేవాళ్ళు ఎవరున్నారో తెలుసుకుందాం. లేదంటే ఈ వేసవి కాలం సెలవుల్లో విజయవాడ అత్తయ్య ఇంట్లో ఉండి అక్కడ నేర్చుకో." అంది ఆవిడ.

పార్థసారథి భార్యవైపు చూసి "వాడిప్పుడు సంగీతం నేర్చుకోడం ఏంటి చామూ! పెద్దాడు ఇంజనీరు, వీడు లాయర్ అవాలి... చదువు ఇచ్చే గౌరవం, సంపద ఈ సంగీతాలు, నాట్యాలు ఇస్తాయా? అందునా వీడికి." కొంచెం హేళనగా అన్నాడు.

అటు మోహన్, ఇటు చాముండేశ్వరి ఇద్దరి గుండెల్లో కలుక్కుమంటూ దిగింది ఆయన హేళన.

"సినిమా పాటల మీద వాడికి ఆసక్తి ఉంది కదండీ. పైగా మన వాడి స్వరం బాగుంటుంది కూడాను" అందావిడ. ఆ మాట నిజమే! భగవంతుడు అతనికి ఇచ్చిన వరాలలో మంచి మనసు ఒకటి అయితే, మరొకటి మంచి స్వరం, మృదుగంభీరంగా ఉంటుంది.

"బాగుంటే! చదువు మీద శ్రద్ధ చూపించమను చాలు" చిరాగ్గా అన్నాడు ఆయన పెరుగు వేసుకుంటూ.

ఆయనకి మోహన్ కన్నా పెద్ద కొడుకు శివరాం అంటే ఇష్టం. అందం, చదువు ఉన్న శివరాం కి పెళ్ళిళ్ళ మార్కెట్ లో మంచి ధర పలుకుతుందని ఆయన నమ్మకం. ఆయనకి మనషుల పట్లకన్నా, ఆ మనిషిని నడిపించే డబ్బు మీద

వ్యామోహం ఎక్కువ. అందుకే చేస్తున్న ఉద్యోగం వదిలేసి, ప్రైవేటు గా బిల్డింగ్ ప్లాన్స్ గీయడం లో ఆసక్తి చూపిస్తున్నాడు. పవిత్ర తండ్రి మాధవ చేస్తున్న కొత్త, కొత్త భవన నిర్మాణాల గురించి విని, ఆయనతో కలిసి పని చేయడానికి గుడివాడ వచ్చాడు. మొదటి నుంచి ఆయన తండ్రి బాగా అస్తిపరుడే. ఆయనది సిమెంట్ వ్యాపారం. ఒక కొడుకుని సివిల్ ఇంజనీరుని, ఒక కొడుకుని ఆర్కిటేక్చర్ చదివించాడు. ఆ ఆర్కిటెక్ట్ పార్ధసారధి.

భర్త సంగతి తెలిసిన చాముండేశ్వరి సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయింది.

ఆయన భోజనం ముగించి అక్కడి నుంచి వెళ్ళిపోగానే మోహన్ తల్లి వైపు చూసి అడిగాడు “అమ్మా నల్లగా పుట్టడం తప్పా?”

కొడుకు కళ్ళల్లో కదిలిన బాధ చూసిన ఆవిడ గుండె చెరువైంది. అతని తల మీద చేయి వేసి ప్రేమగా అంది.” ఎవరి మాటలు పట్టించుకోకు నాన్నా. నీకేం గోపాలకృష్ణుడివి. నీలమేఘశ్యాముడు కృష్ణుడుని బోలెడు మంది గోపికలు ఆరాధించారు. నువ్వు అంతటి వాడివి”.

మోహన్ ప్లేటులో చూపుడు వేలితో కెలుకుతూ అన్నాడు “అమ్మా? అంతమంది నాకొద్దు కానీ, పవిత్ర నన్ను ప్రేమిస్తుందా?”

ఆవిడ అదిరిపడి చూసింది.

“ప... పవిత్రా”

“అవునమ్మా నాకు పవిత్ర అంటే పంచప్రాణాలు. తను లేకపోతే నేను బతకలేను. నాకు తను కావాలమ్మా. తను నా పక్కన ఉంటే నేను బాగా చదువుకుని, వృద్ధిలోకి వస్తాను. తను నా పక్కన ఉంటే ఈ ప్రపంచంలో ఎక్కడికైనా ఆనందంగా వెళ్తాను. నాకు పవిత్ర కావాలి.”

ఆవిడ నిశ్చేష్టురాలై కొడుకు మొహంలోకి రెప్ప వేయకుండా చూడసాగింది.

“వీడు ఏం మాట్లాడుతున్నాడు? స్పృహలో ఉండే మాట్లాడుతున్నాడా? కొన్నాళ్ళ క్రితం తనూ, భర్తా, మాధవశర్మ కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యం బంధుత్వంగా మార్చుకోవాలని, పెద్ద కొడుకు శివరాం కి పవిత్రని అడగాలని అనుకున్నారు. శివ చదువు కూడా పూర్తి అవుతోంది…త్వరలో మంచిరోజు చూసుకుని నాంచారమ్మతో ఈ విషయం కదపాలని అనుకున్నారు కూడా. ఆ విషయం తను నాంచారమ్మతో చూచాయగా ప్రస్తావించడం మోహన్ కి తెలుసు. ఈ విషయాలన్నీ తెలిసి వాడు ఇలా మాట్లాడడం. ఆవిడకి మతిపోతున్నట్టు ఉంది. భర్త ఆ మాటలు విన్నాడేమో అన్నట్టు అటూ, ఇటూ కంగారుగా చూసి, మోహన్ తో అంది. “త్వరగా తిని అలా పెరట్లోకి రా”.

ఆవిడ గబుక్కున లేచి డైనింగ్ టేబుల్ మీద గిన్నెలు తీసుకుని వంటగదిలోకి వెళ్ళింది.

తల్లి అలా అనేసరికి మోహన్ కి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టు అయింది. అమ్మకి ఇష్టమే. అవును అమ్మకి పవిత్ర అంటే చాలా ఇష్టం. పవిత్రని కోడలిగా ఈ ఇంటికి తీసుకురావాలనేగా ఆవిడ కోరిక. పెద్ద కోడలిగా వస్తే తను ఆమెని వదినగా అంగీకరించలేడు... తన భార్యగా వస్తే. ఆహా. ఈ ఇంట్లో పవిత్ర, తనూ. అతని కళ్ళ ముందు తనూ, పవిత్రా చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నట్టు అందమైన దృశ్యాలు సినిమా రీలులా తిరిగాయి.

ఆశించడంలో తప్పేంలేదు...ఆశించింది లభించకుంటేనే తెలుస్తుంది ఆకాశానికి నిచ్చెనలు వేయడం సులువేకానీ ఎక్కడం, అంచులు చేరడం సులువు కాదని.

గంతులేస్తూ పెరట్లోకి వెళ్ళిన మోహన్ ని సూటిగా అడిగింది చాముండేశ్వరి. "అన్నయ్యకి పవిత్రని అడగాలనుకున్నాం నీకు తెలుసు కదూ"

'పవిత్రంటే నీకంత ఇష్టమా? ఇప్పుడు చెప్తావేంటిరా నాన్నా. నేను తప్పకుండా వాళ్ళ నాన్నగారితో మాట్లాడి మీ పెళ్లి చేస్తాను' అని అంటుందని ఊహించిన మోహన్ తల్లి సూటిగా అలా అడిగేసరికి తెల్లబోయాడు.

"గుర్తుందా నేను, నాన్నగారు మాట్లాడుకున్నాం ఆరోజున" మళ్ళీ అడిగింది ఆవిడ.

అది వాస్తవం కానీ ఆ వాస్తవం అంగీకరించడానికి మోహన్ మనసు సిద్ధంగా లేదు. అందుకే కొంచెం నిర్లక్ష్యం గా అన్నాడు. "మీరు అనుకున్నారు కానీ అన్నయ్య అనుకోలేదు కదమ్మా. నేను మాత్రం పవిత్రని చూసిన క్షణం నుంచీ తనని ప్రేమిస్తూనే ఉన్నానమ్మా. నేను తను లేకుండా బతకలేనమ్మా"

"ఇలా కూర్చో" ఆవిడ అరుగు మీద తన పక్కన చోటు చూపించింది. మోహన్ కూర్చున్నాడు.

"నువ్వు ఇంకా చిన్నవాడివి. అన్నయ్య పెళ్లి కాకుండా నీకెలా చేస్తాము? చదువు పూర్తి కాలేదు, ఏమి లేదు ప్రేమ, పెళ్లి అంటే అర్థం తెలుసా నీకు? ఇప్పుడు ప్రేమ, పెళ్లి అంటూ మొదలెడితే, నీ భవిష్యత్తు ఎలా ఉంటుందో ఆలోచించావా? పైగా ఆ అమ్మాయి పుత్తడి బొమ్మ. నిన్ను ఇష్టపడుతుందని ఎలా అనుకుంటున్నావు?"

"అమ్మా" బేలగా చూసాడు ఆవిడవైపు. చిరు చీకట్లో కొడుకు కళ్ళల్లో తడి ఆవిడ మనో నేత్రం పసిగట్టింది. అతని పిలుపులో దుఃఖం ఆమె తల్లి మనసుని తట్టి లేపింది. కొడుకు చేయి తన చేతిలోకి తీసుకుని ఆర్ద్రంగా అంది. "తప్పు నాన్నా! అర్హత లేని ఆశ మంచిది కాదు. ఆ పిల్ల పెళ్ళికి ఒక్కసారి ఊ అందంటే మొత్తం గుడివాడలో మగపిల్లలు క్యూ కడతారు."

"నాకదే భయం. అందుకే ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా పవిత్రని నాదాన్ని చేసుకుంటాను. లేకపోతే నా పవిత్రని ఎవరన్నా ఎత్తుకుపోతారు. ఆ తరవాత నేను జీవించి వృధా కదమ్మా"

ఆవిడ విస్తుబోయింది. ఎప్పటి నుంచి వీడు ఆ పిల్ల మీద ఇంతగా మమతల లతలు పెనవేసుకున్నాడు. ఇప్పుడు ఆమె కాదన్నా, తను, భర్త కాదన్నా వీడు ఏమైపోతాడు? ఆవిడకి మతి పోతున్నట్టుగా ఉంది. ఎలా? వీడిని ఈ వ్యామోహం

నుంచి బయట పడేయాలి? అసలు నాంచారమ్మ తో కానీ, వర్ధనితో కానీ మా మోహన్ కి మీ పవిత్రని ఇస్తారా అని ఎలా అడగడం? ఇద్దరూ కలిసి పేడనీళ్ళు చిక్కగా కలిపి మరీ తన మొహాన పోస్తారు. ఇంతకాలం నుంచి కాపాడుకుంటున్న గౌరవాభిమానాలు మంట కలుస్తాయి. స్నేహాన్ని బంధుత్వం గా మార్చుకోవాలన్న తన ఆశా, భర్త ఆశా ఏమై పోతోంది? మోహన్ గబుక్కున ఆవిడ ఒడిలో పడుకుని గాద్గదికంగా అన్నాడు "అమ్మా ప్లీజ్ అమ్మా నేను ఇంకెప్పుడూ ఏది అడగను...ఈ ఒక్క కోరికా తీర్చమ్మ. ఎలా అయినా సరే. వాళ్లకి చెప్పు. పవిత్ర లేకపోతె మా మోహన్  బతకడు అని చెప్పు. మా అబ్బాయికి జీవితం ప్రసాదించండి అని వేడుకో. నాకోసం వేడుకో."

భ్రాన్తపడి వింటోన్న ఆవిడ  సమాధానం చెప్పలేని అశక్తతో శిలలా కూర్చుండిపోయింది.

మా అబ్బాయి చావుబతుకుల మీద ఉన్నాడు, రక్తదానం చేయండి అని అడగచ్చు, లేదంటే ఆర్థికంగా సాయపడమని అడగచ్చు, వైద్య సహాయం అడగచ్చు... అంతేగానీ మీ అమ్మాయి లేకపోతే మా అబ్బాయి బతకడు... అర్హత లేని నా కొడుక్కి మీ అమ్మాయిని దానం చేసి, నా కొడుకుని బతికించండి అని అడగాలా? వీడికి బుద్ధి వికసించాల్సింది పోయి, వికటిస్తోందేమిటి? ఆవిడ సమాధానం లభించని ప్రశ్నలు రోద చేస్తుంటే చలనం లేని దానిలా శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది. మోహన్ సన్నగా వెక్కిళ్ళు పెడుతున్నాడు.

మోహన్ దుఃఖం, ఆవిడ ఆవేదన ఆ చీకట్లో వింతగా ప్రతిధ్వనించసాగాయి. ఆ ధ్వనుల అర్థం కాలం మాత్రమే చెప్పగలదు.

యవ్వన ప్రారంభదశలో ఆ యువకుడి గుండెల మీద పవిత్ర అనే అందమైన యువతి చేసిన ఆ తొలి సంతకం ఎన్నటికీ చెరిగిపోదని, ఏ కొలిమితోనూ కాల్చలేనిదని ఆవిడకి అర్థం అవుతూ ఉంటే ఇన్నేళ్ళ ఈ జీవితంలో మొదటిసారి పరిష్కారం లేని సమస్య ఆమెని దహించసాగింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS